క్లుప్తంగా

ఐటీఐకి దరఖాస్తు చేసుకోండి

విజయపురం : ప్రభుత్వ ఐటీఐ (పన్నూర్ సబ్ స్టేషన్ దగ్గర) 2024–25 సంవత్సరానికి గాను మిగిలిన సీట్ల భర్తీ మూడవ విడత దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ లలిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కానీ, నేరుగా కానీ దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ లోపు సమర్పించవచ్చని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 8639790174, 6303156450, 9494434236, 9177035120, 9885320544ను సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కుమార్

పెనుమూరు(కార్వేటినగరం): తిరుపతి మాధురి రెమిడీ హాస్పిటల్స్ చైర్మన్ మాధురి గాంధీ ఆధ్వర్యంలో ఆదివారం పెనుమూరు ప్రాథ మిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పెనుమూరు పరిసర మండలాల నుంచి మొత్తం 275 మంది రోగులు ఉచితంగా వైద్య సేవలు పొందారు. వైద్యులు ఉచితంగా షుగర్, బీపీ టెస్ట్‌లతో పాటు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ శిబిరానికి వచ్చిన 25 మంది రోగులకు ఉచిత ప్రయాణంతో పాటు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు కుమార్, అంజికుమార్, మోహన్, రమణ, ప్రవల్లిక, జనరల్ మేనేజర్ మంజునాథ్, మార్కెటింగ్ మేనేజర్ రవీంద్రరెడ్డి, కళావతి, పెనుమూరు మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి

నింద్ర: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ రామచంద్ర సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన పలు వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని చెప్పారు. వాహనాలు అధిక వేగంగా నడపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నింద్ర: మండల కేంద్రంలో శ్రీ శంకర నేత్రాలయం ద్వారా ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు చేసి వారిని ఉచితంగా ఆపరేషన్ చేసి వారికి అద్దాలు పంపిణీ చేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. మొత్తం 42 మందికి పరీక్షలు చేశారు. వాటిలో 9 మందికి ఆపరేషన్‌కు చెన్నై వైద్యశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేత



బాధితురాలికి బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

కార్వేటినగరం (పెనుమూరు) : సప్తగిరి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ ప్రభాకరన్ రూ.5 లక్షల బీమా చెక్కును బాధిరాలికి అందజేశారు. బ్యాంకు మేనేజర్ నాగరాజ సలహా మేరకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది యూనివర్సల్ సంపో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో హరికృష్ణతో బీమా ప్రీమియం చేయించారు. ఇటీవల పాముకాటుకు గురైన హరికృష్ణ మరణించడంతో రూ.5 లక్షల బీమా సాయం వచ్చిందన్నారు. ప్రభాకరన్ మాట్లాడుతూ సప్తగిరి బ్యాంకు ఖాతాదారులు సంవత్సరానికి రూ.175 ప్రీమియం కట్టడం ద్వారా రూ.5 లక్షల వరకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సల్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికారి మేమాద్రి పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆడి అమావాస్య పూజలు



ఆలయంలో భక్తులకు అన్నదానం

నగరి : మున్సిపల్ పరిధి కీళపట్టు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఆడి అమావాస్య పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆడి నెలలో ఆదివారం వచ్చే అమావాస్యను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు రెండువందల మంది భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బడి పంతుల అవస్థలు

- సెలవు పెట్టడానికి వీలులేని పరిస్థితి
- ఖాళీ పోస్టులు భర్తీ చేయని సర్కారు
- తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య

నగరి : ప్రభుత్వ పాఠశాలలకు టీచర్ల కొరత ప్రస్తుతం వెంటాడుతోంది. ఇది ఉపాధ్యాయుల పాలిట గుదిబండలా మారింది. విద్యార్థుల సంఖ్యకు తగిన నిష్పత్తిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. గత ప్రభుత్వం బదిలీల ద్వారా సర్దుబాటు చేసి పంపించగా, కూటమి ప్రభుత్వం ఆ బదిలీలను రద్దు చేసింది. దీంతో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలకు ఏకోపాధ్యాయులను నియమించి విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు వారిని కేటాయిస్తున్నారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులు సెలవు పెట్టడానికి కూడా వీలులేక ఇబ్బందులకు గురవుతున్నారు. వారు సెలవు పెడితే పాఠశాలకు సెలవు ఇచ్చే పరిస్థితి ఉండటంతో విద్యాశాఖ అధికారులు వీరికి సెలవులు ఇవ్వడం లేదు. ఇది ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల పాలిట శాపంగా మారింది. నియోజకవర్గ వ్యాప్తంగా 316 పాఠశాలలు ఉండగా అందులో 20,335 మంది చదువుకుంటున్నారు. వీరికి పాఠాలు బోధించడానికి 795 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా ప్రస్తుతం 669 మంది మాత్రమే ఉన్నారు. దీంతో నియోజకవర్గ పరిధిలో సుమారు 60 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయి. ఈ ఉపాధ్యాయులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక ఉపాధ్యాయులే ఐదు తరగుతులకు 18 సబ్జెక్టులు బోధించాల్సి ఉండడంతో పాటు ప్రధానోపాధ్యాయ బాధ్యతలు, రికార్డుల నిర్వహణ, పాఠశాల పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఇటీవల ఏకోపాధ్యాయుల భారాన్ని తగ్గించాలంటూ యూటీఎఫ్ నాయకులు విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.



గతంలో ఆర్కేవీబీ పేట పాఠశాలలో నాణ్యమైన భోజనం తింటున్న విద్యార్థులు (ఫైల్)

పాఠశాలలో తగ్గిన విద్యార్థుల సంఖ్య

పాఠశాలల మెర్జింగ్ జీవో 117 కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య గత విద్యా సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది తగ్గింది. నగరి మండలంలోనే గత విద్యాసంవత్సరంలో 21,260 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 20,335 మంది మాత్రమే చదువుతున్నారు. ఎన్నికల సమయంలో జీవో 117ను రద్దు చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించినా ఆ అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

సర్కారు విద్యకు కూటమి గ్రహణం

కార్వేటినగరం: ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్కారు స్కూళ్ల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదనే మాటలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో కనీస వసతులకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయుల బదిలీలకు మార్గదర్శకాలను రూపొందిస్తే, అప్పటి ప్రతిపక్షంలో ఉంటున్న టీడీపీ కోర్టులకు వెళ్లి స్టే తెచ్చి అడ్డుకుంది. ప్రస్తుతం అధికారంలో ఉంటున్న కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధిని గాలికి వదిలేసింది. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను భర్తీ చేయకపోవడంతో స్కూళ్లలో విద్యార్థులకు విద్యాబోధన కష్టతరంగా మారింది. దీంతో విద్యార్థులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించినట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

గతంలో అలా.. ఇప్పుడు ఇలా..

గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు అందించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం (చిక్కీ వారానికి 3 రోజులు, గుడ్డు వారానికి 5 రోజులు, రాగిజావ వారానికి 3 రోజులు) నాణ్యమైన భోజనం అందిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో మిడ్ డే మీల్స్ నిర్వహించడం చాలా కష్టతరంగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు.

పథకాల పేర్లు మార్చినా..

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉన్న పథకాలకు పేర్లు మారుస్తోంది. కానీ వాటిని అమలు చేయడంలో మాత్రం విఫలం అవుతోందని బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఉపాధ్యాయుల ఖాళీలు పేరుకుపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. నియోజకవర్గంలో మొత్తం పాఠశాలల సంఖ్య 419 కాగా, అందులో ప్రాథమిక పాఠశాలలు 342, ప్రాథమికోన్నత పాఠశాలలు 30, ఉన్నత పాఠశాలలు 47 ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.116.12 లక్షలు వెచ్చించి 224 పాఠశాలలో నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా స్కూళ్లలో జరుగుతున్న నాడు–నేడు పనులకు నిధులు కేటాయించకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. నియోజకవర్గ స్థాయిలో 17,036 మంది విద్యార్థులు ఉండగా, ఉపాధ్యాయులు మాత్రం కేవలం 730 మంది మాత్రమే ఉన్నారు. దీంతో విద్యార్థులకు విద్యాబోధన అంతంతమాత్రంగానే అందుతోంది. నియోజకవర్గంలో 109 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది.



ముడిపల్లిలోని ఏకోపాధ్యాయ పాఠశాల

పాఠశాలల వివరాలు

	నగరి	విజయపురం	పుత్తూరు	నింద్ర	వడమాలపేట
ఉన్నత పాఠశాలలు	12	5	12	5	6
ప్రాథమికోన్నత పాఠశాలలు	7	2	5	4	5
ప్రాథమిక పాఠశాలలు	69	38	78	37	32
మొత్తం పాఠశాలలు	87	45	95	46	43
విద్యార్థుల సంఖ్య	7926	2145	6616	1852	1796
ఉండాల్సిన ఉపాధ్యాయులు	252	138	144	125	133
ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు	180	128	121	120	120
భర్తీచేయాల్సిన ఉపాధ్యాయులు	72	10	23	5	13



పాలసముద్రం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు(ఫైల్)

విద్యావలంటీర్లనైనా నియమించాలి



ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులు ఉన్నా పాఠశాలలకు సెలవు పెట్టలేని పరిస్థితి ఉంది. వారు సెలవు పెడితే పాఠశాలకు సెలవు ఇవ్వాల్సిందే. విద్యావలంటీర్లనైనా నియమించాలి. అప్పుడే ఏకోపాధ్యాయులపై ఉన్న భారం తగ్గుతుంది.

– మునిరత్నం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, నగరి

ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలి



గత ప్రభుత్వం అధ్వానంగా ఉన్న సర్కారు పాఠశాలలను నాడు–నేడు కార్యక్రమంతో నవీకరించారు. అయితే ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో ఒక్కరే అన్ని పనులు చూడాల్సి ఉంది. అదనంగా ఉపాధ్యాయులను గానీ, విద్యావలంటీర్లను గానీ నియమిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎం.రామూర్తి, ముడిపల్లి దళితవాడ, నగరి మండలం

సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

శ్రీరంగరాజపురం : ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ సరిత స్పష్టం చేశారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సరిత మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. వివక్షకు తావులేకుండా అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలని, అర్హులైన పాడి రైతులు మినీ గోకుళం నిర్మాణం కోసం సమీప పశువైద్య ఆరోగ్య కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులకు పండ్ల తోటల పెంపకానికి జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి పనులు నిర్వహించడానికి నిధులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ అమరనాథ్, ఈఓపీఆర్‌డీ పురుషోత్తం, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అగ్నిహోత్రిగా ద్రౌపది



అగ్నిహోత్రి అలంకరణలో ద్రౌపదీదేవి



అమ్మవారికి అగ్నిపూజలు చేస్తున్న భక్తులు

నగరి : మునిసిపల్ పరిధి చింతలపట్టిడలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ద్రౌపది తిరునాళ్లలో భాగంగా ఆదివారం ద్రౌపదీదేవికి అగ్నిహోత్రి అలంకారం చేశారు. అఖిలోభుడనే రాక్షసుని సంహరించడానికి ద్రౌపదీదేవి అగ్ని నుంచి అవతరించిందని ప్రతీతి. అగ్ని నుంచి ఉద్భవించినందుకుకు ప్రతీకగా ఆమెకు అగ్నిహోత్రి అలంకారం చేశారు. అమ్మవారి విగ్రహం చుట్టూ పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయం వద్ద నిర్వహించిన మహాభారత పారాయణంలోనూ భాగవతారిణి అగ్ని కుండలను పట్టుకొని పారాయణం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ వేడుకలను చూడటానికి భక్తులు ఆలయం వద్ద అధిక సంఖ్యలో బారులు తీరారు. ఏర్పాట్లను ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ పర్యవేక్షించారు.

నగరి ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏఎస్ రవి



నగరి : నగరి ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏఎస్ రవి ఎంపికయ్యారు. ఆదివారం పీసీఎన్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన అధ్యక్షుని ఎన్నికలో నగరి పట్టణానికి చెందిన ఏఎస్ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులకు తాను అండగా ఉంటానని వారి సమస్యలు పరిష్కరించడంలో సభ్యులందరితో కలిసి ముందడుగు వేస్తానని అన్నారు. మిగిలిన కార్యవర్గాన్ని కూడా సభ్యులందరితో కలిసి త్వరలో ఎన్నుకుంటామని తెలిపారు. నూతన అధ్యక్షునికి సభ్యులు దుశ్శాలువలతో సత్కరించారు.

వీధి కుక్కలతో జనం బెంబేలు

గంగాధర నెల్లూరు: మండలకేంద్రంలో వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదుల సంఖ్యలో కుక్కలు విచ్చలవిడిగా వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతోపాటు పలు ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా వస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీధికుక్కలను నియంత్రించాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

రక్తదాన శిబిరం

గుడిపాల: చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సిగ్న్ అండ్ షైన్ ట్రస్ట్, సీఎంసీ ఆస్పత్రి వారు సంయుక్తంగా నరహరిపేట సీఎస్‌ఐ చర్చిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 20మంది వరకు రక్తదానం అందించారు. సీఎంసీ డాక్టర్లు మాట్లాడుతూ రక్తదానం ఇవ్వడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి వీలుంటుందన్నారు. ఎవరూ అపోహలు వీడి రక్తాన్ని ఇవ్వడం వల్ల ఎదుటి వారి ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందన్నారు.

అన్సర్ మృతి పార్టీకి తీరని లోటు



అన్సర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేసిన అన్సర్(61) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలోని పాత సంతవీధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అన్సర్ ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాతసంత వీధికి చేరుకుని అన్సర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. అలాగే అన్సర్ మృతి చెందిన విషయం తెలిసి జీడీనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కళత్తూరు కృపాలక్ష్మి ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం నిత్యం పోరాటం చేసిన అన్సర్ లేడన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని తెలిపారు. పార్టీ తరపున అన్నివిధాలా వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, సోషల్ మీడియా మండల కన్వీనర్ రఫీ, ఆర్.సుబ్రమణ్యం, ధనయాదవ్, మణి తదితరులు ఉన్నారు.

ఓంశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అంబలి, పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం : మండలంలోని నిశ్శింకాపురం గ్రామంలో వెలసిన ఓంశక్తి అమ్మవారికి ఆదివారం ఆడి అమావాస్యను పురస్కరించుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహిళలు పంబవాయిద్యాలతో అంబలిని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఆలయ అర్చకులు గురుస్వామి అమ్మవారిని భక్తులు తీసుకొచ్చిన వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఎదుట ఉంచిన శూలానికి తొమ్మిది బిందెల పాలు, పసుపు నీరు, అంబలితో అభిషేకించారు.

స్వీట్ కార్న్ సాగు.. ఆదాయం బాగు!

అధిక పోషకాలు ఇచ్చే తీపి మొక్కజొన్న మార్కెట్లో అధిక ధర పలుకుతుండడంతో డిమాండ్ పెరిగింది. దీంతో రైతన్నలు (స్వీట్ కార్న్)తీపి మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో తీపి మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సాగులో మెలకువలు తెలుసుకుంటే పంట లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

- ఇటీవల పెరిగిన మొక్కజొన్న పంట సాగు
- సేంద్రియ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వచ్చే అవకాశం
- మొక్కజొన్న సాగు చేసే రైతులకు వ్యవసాయ అధికారుల ప్రోత్సాహం



తొట్టికండ్రిగ సమీపంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట



ఢిల్లీప్రసాద్

పాలసముద్రం : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని తొట్టికండ్రిగ, సింహరాజుపురం, గొల్లకండ్రిగ, తిరుమలరాజుపురం, ఆముదాల, వనదుర్గాపురం, గంగమాంబపురం గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో మొక్కజొన్న, స్వీట్ మొక్కజొన్న పంట సాగులో ఉంది. రబీ సీజన్‌లో అక్టోబర్ నుంచి జనవరి మధ్యలో పంట విత్తుకు అనుకూలంగా ఉంటుంది. సాగు విధానంలో తెగుళ్ల నివారణపై వ్యవసాయ అధికారి ఢిల్లీప్రసాద్ పలు సూచనలు, సలహాలు తెలిపారు.

మేలైన విత్తనాలు..అనువైన నేలలు

మాధురి రకం మొక్కజొన్న పంట సాగు చేసిన తరువాత 60 నుంచి 75 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది. ఎకరాకు 25 నుంచి 26 వేల పొత్తులు (కండెలు)వస్తాయి. 20 శాతం చక్కెర ఉన్నందున తినడానికి రుచిగా ఉంటుంది. ఎకరాకు ఐదు నుంచి ఏడు టన్నులు పశుగ్రాసం వస్తుంది. ప్రియ రకం 65 నుంచి 80 రోజుల్లో దిగుబడి వస్తుంది. ఎకరాకు 28 నుంచి 30 వేల కండెలు వస్తాయి. 20 నుంచి 22 శాతం చక్కెర కలిగి తినడానికి అనువుగా ఉంటుంది. ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది టన్నులు పశుగ్రాసం వస్తుంది. సారవంతమైన నీరు ఇంకే నేలలు. ఒండ్రు మంటి కలిగిన ఇసుక నేలలు, నీరు నిల్వ ఉన్న, చౌడు భూములు పనికిరావు.

సాగు విధానం

విత్తడానికి ముందు పొలాన్ని రెండు మూడుసార్లు నాగలితో బాగా దుక్కులు చేయాలి. ఆఖరి దుక్కులో ఎకరాకు పది టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఎకరాకు నాలుగు కిలోల విత్తనం సరిపోతుంది. నీరు పారుదల సులభంగా ఉండే విధంగా విత్తుకోవాలి. కలుపు నివారణ ముఖ్యం. విత్తిన వెంటనే ఎకరాకు అట్రజిన్ పొడి మందును ఒక కిలో చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. విత్తనం వేసిన నెల రోజుల తర్వాత వెడల్పాటి కలుపు మొక్కలు కనిపిస్తే 2.4 డిసోడియం సాల్ట్ 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు కానీ, కోళ్ల ఎరువు కానీ చివరి దుక్కుల్లో వేసి నేలలో కలియదున్నాలి. ఎకరాకు 65 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ వేయాలి. పైరుకు నేల స్వభావాన్ని బట్టి 4 నుంచి 6 తడులు నీరు కట్టాలి. 30 నుంచి 40 రోజుల్లోపు ఉన్న లేతపైరుకు అధిక నీరు పెట్టకూడదు. పంటకోత ఆలస్యమైతే చక్కెర శాతం తగ్గుతుంది. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఉదయం గానీ, సాయంత్రం కానీ కోత చేపట్టాలి.

పంట రక్షణ కోసం.. కాండం తొలుచు పురుగు

ఈ పురుగులు మొలకెత్తిన 10 నుంచి 20 రోజుల్లో మొక్కలను ఆశిస్తాయి. పిల్లపురుగు మొదటి ఆకులపైన పత్రహరితాన్ని గోకి తింటాయి. తర్వాత ముడుచుకుని ఉన్న ఆకు ద్వారా కాండం లోపలకు ప్రవేశిస్తుంది. ఈ ఆకులపై గుండు సూది మాదిరిగా రంధ్రాలు గానీ, పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కనిపిస్తాయి. దీనివల్ల మొగ్గ చనిపోయి ఎండిపోతుంది. తద్వారా దిగుబడి తగ్గుతుంది. దీని నివారణకు పురుగు ఆశించిన మొక్కలను పీకేయాలి. పొలం చుట్టూ మూడు వరుసల్లో జొన్న పంటను ఎర పంటగా వేసి 45 రోజుల తర్వాత తీసి వేయాలి. పైరు వయసు 20 రోజుల్లో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే 3 కిలోల కార్బోఫ్యూరాన్ 3 గులికలను ఆకుల సుడుల్లో వేయాలి. తెగులు సోకిన మొక్కజొన్న ఆకులపై కోల ఆకారంలో గోధుమ వర్ణపు మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు మొదటి కింది ఆకులపై కనిపించి పెద్దవై కూడా వ్యాపిస్తాయి. వాతావరణంలో అధిక తేమ ఉన్నప్పుడు ఆకు అంతా ఎండి మొక్కలు చనిపోయినట్లు కనిపిస్తుంది. దీని నివారణ కోసం మాంకోజెబ్ పొడి మందును ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటికి రెండుసార్లు పిచికారీ చేయాలి.